## నేడు పాలిసెట్

మెదక్ మున్సిపాలిటీ, మే 12: పాలిసెట్ (పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కన్వీనర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భవాని సోమవారం తెలిపారు. మెదక్‌లో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సిద్దార్థ్ మోడల్ స్కూల్‌లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 1,776 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగనున్నట్లు తెలిపారు.

## నేడు దివ్యాంగుల ధర్నా

మెదక్ మున్సిపాలిటీ, మే 12: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేయనున్నట్లు దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అడివయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం చేయనున్న ఈ ధర్నాలో జిల్లాలోని దివ్యాంగులు భారీగా తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రేపు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

మెదక్ మున్సిపాలిటీ, మే 12: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీఐఎస్‌సీవో, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో 20 నుంచి 25 ఏండ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు పాల్గొనాలని పేర్కొన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం, ఇటీవలే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు సైతం అర్హులన్నారు. వివరాలకు 9494559027 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కును అందిస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్

చిన్నశంకరంపేట, మే 12: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 17మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే రోహిత్ సోమవారం పంపిణీచేశారు. పదో తరగతిలో 570 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన మడూర్ జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి రాజేశ్వరిని సన్మానించారు. ధర్పల్లిలో కుర్మసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరలో పాల్గొన్నారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎంఈవో పుష్పవేణి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్ నాయకులు రాజిరెడ్డి, శివకుమార్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేగోడులో..



రేగోడ్, మే 12: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 35 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తహసీల్దార్ దత్తారెడ్డి తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

చేగుంట, మే12: ధాన్యం కొనుగోలును త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ సూచించారు. మండలంలోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిలువలకు సంబంధించి వివరాలను సేకరించారు. ఇప్పటి వరకు 25 వేల క్వింటాళ్ల సన్నధాన్యం, లక్ష క్వింటాళ్ల దొడ్డు ధాన్యం సేకరించినట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో అత్యధికంగా చేగుంట మండలంలో కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం 3300 రైతుల నుంచి ధాన్యం సేకరించినట్లు తెలిపారు. 2600 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే మిగతా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. వర్షాలు పడుతుండంతో త్వరలోనే ధాన్యం సేకరణ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆయన వెంట ఉప తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ జయభారత్‌రెడ్డి, పలు సెంటర్ల ఇన్‌చార్జిలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో త్రివిధ దళాలదే విజయం

కౌడిపల్లి, మే 12: ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి గట్టి బుద్ధి చెప్పిన ఘనత త్రివిధ దళాలదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. సోమవారం కౌడిపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రాకేశ్, పలువురు పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిస కావొద్దు

చేగుంట, మే 12: యువత మత్తుకు బానిస కావొద్దని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు పేర్కొన్నారు. కలెక్టర్, పౌర సంబంధాల శాఖ ఆదేశాల మేరకు చేగుంటలో సోమవారం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, గంజాయి, డ్రగ్స్ వంటికి వాటికి యువత బానిస కావద్దని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు శివోల్ల కృష్ణ, రామారావు, ఎల్లయ్య, దేవదాస్, నర్సయ్య, సిద్దులు, శేఖర్, విజయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

చేగుంట, మే 12: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వడియారం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లీలావతి పేర్కొన్నారు. మండలంలోని వడియారంలో సోమవారం బడి బాటలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.సిద్దిరాములు, కృష్ణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు సూర్యప్రకాశ్, యాదగిరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

# పారిశుధ్యం సరే.. బిల్లులేవి?

- బిల్లులు ఇవ్వని రేవంత్ సర్కార్
- చెత్త ట్రాక్టర్ల బిల్లులు బంద్
- ఒక్కో పంచాయతీకి రూ.5 లక్షల వరకు బకాయిలు
- 18 నెలలుగా అవస్థలు పడుతున్న కార్యదర్శులు
- త్వరలోనే సమ్మెకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



దామరచెర్వు, సుతారిపల్లిలో మురుగు కాల్వలు



అక్కన్నపేటలో పేరుకు పోయిన మురుగు

రామాయంపేట, మే 11: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని గాంధీజీ కన్న కళలను నేడు రేవంత్ ప్రభుత్వం ఆవిరి చేస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసి 18 నెలలు గడుస్తున్నా పంచాయతీలకు బిల్లులు మంజూరు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైంది. పంచాయతీలను శుభ్రంగా ఉంచాలని అధికారులను పురమాయిస్తుండడం తప్ప, వాటికి నిధులు కేటాయించడంలో శ్రద్ధ చూపడం లేదు. రామాయంపేట ఉమ్మడి మండలంలో ఏ ఒక్క పంచాయతీలో కార్యదర్శులకు ఒక్క రూపాయి కేటాయించింది లేదు. 18 నెలలుగా పంచాయతీలను శుభ్రంగా ఉంచాలని కార్యదర్శులకు జిల్లా స్థాయి అధికారులు ఆదేశించడం తప్ప పైసా కూడా మంజూరు చేయడంలేదు. గ్రామాల్లో మురుగు కాల్వలు, వీధులు శుభ్రం చేయడం, విద్యుత్ లైట్లు వేయించడం తదితర పనులను పంచాయతీ కార్యదర్శులు చేయిస్తున్నారు.

### కనీస ఖర్చులకూ దిక్కులేదు

ఒక్కో పంచాయతీకి నెలకు వేల రూపాయలు ఖర్చు అవుతుంది. చెత్త ట్రాక్టర్‌కే రోజుకు పది లీటర్ల డీజిల్ కావాలి. వారికి బిల్లులు అందకపోవడంతో కోనాపూర్, దామరచెర్వు తదితర గ్రామాల్లో చెత్త ట్రాక్టర్లను నిలిపివేశారు. త్వరలో మరిన్ని గ్రామాల్లోనూ చెత్త ట్రాక్టర్లు బందు చేయనున్నట్లు తెలిసింది. మండలంలో 15 పంచాయతీలకు ఒక్కో గ్రామానికి ప్రభుత్వం రూ.5లక్షల వరకు బాకీ ఉన్నది. జిల్లా కేంద్రం నుంచి ఏ అధికారి వచ్చినా వారి ఖర్చులు, వారి వాహనాల్లో పెట్రోల్, డీజిల్ ఖర్చులు కూడా కార్యదర్శులే భరిస్తున్నారు. జీతం కుటుంబ అవసరాలకు కాకుండా పంచాయతీలకు ఖర్చు పెడితే తామెలా బతకాలంటూ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలోనే సమ్మెకు సిద్ధం

పంచాయతీ బిల్లులు రాకపోవడంతో త్వరలోనే కార్యదర్శులు సమ్మెకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి లక్షల్లో బకాయిలు ఉంది. ఈ బకాయిలు భరించాలంటే తమ వల్ల కాదని, తాము అప్పులు చేసి పంచాయతీలను బాగు చేస్తున్నామని చెబుతున్నారు. తమకు బిల్లులు వచ్చే వరకు విధులు చేపట్టబోమని, నేడో రేపో సమ్మెకు సిద్ధపడుతున్నామని పలువురు చెబుతున్నారు.

### బిల్లులు వచ్చేలా ప్రయత్నిస్తున్నాం



పంచాయతీల్లో బిల్లులు రాకపోవడం తెలిసిందే. త్వరలోనే కార్యదర్శులకు బిల్లులు వచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. కార్యదర్శులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. కచ్చితంగా బిల్లులు వస్తాయి. బిల్లులు రాక పోవడంతో కార్యదర్శులు కొంత ఇబ్బంది పడ్తున్నది వాస్తవమే.

**- షాజులుద్దీన్, ఎంపీడీవో, రామాయంపేట**

# కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- పెద్దలను గౌరవించాలి
- రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి



రామాయంపేట: పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి, పద్మాదేవేందర్‌రెడ్డి



పాపన్నపేటలో బీరప్ప, కామరతిల కల్యాణంలో పూజలు చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, మే 12: ఆలయాలను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని, అప్పటి సీఎం ఆధ్యాత్మిక చింతనతో ఎక్కడ ఆలయం ఉన్నా నిధులు మంజూరు చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రామాయంపేటలోని పెద్దమ్మ ఆలయ 15వ వార్షికోత్సవానికి విచ్చేసిన ప్రత్యేక పూజలు చేశారు. స్వామీజీ ఆలయంలో పెద్దమ్మ, పెద్దిరాజులకు కల్యాణం చేయించి, భక్తులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలయాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ఆలయాలు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయనే నానుడితో కేసీఆర్ దేవాలయాలను బాగు చేశారన్నారు. అనంతరం రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామిజీ మాట్లాడుతూ పెద్దలను గౌరవిస్తేనే భగవంతుడి అనుగ్రహం దక్కుతుందని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రులు, అత్తామామలను గౌరవిస్తే దేవుడు కూడా కరుణిస్తాడన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆలయంలో స్వామికి ఒడిబియ్యం పోసి మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పద్మాదేవేందర్‌రెడిని గొల్పర్తి గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో పురపాలిక మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, మాజీ కౌన్సిలర్లు మల్యాల కిషన్ కవిత, బస్వయ్య, రాము, రాజు యాదవ్, కృష్ణాగౌడ్, ఆలయ కమిటీ, గ్రామ పెద్దల పాల్గొన్నారు.

### తిరుమల నాథుడి సేవలో స్వామీజీ

నిజాంపేట,మే12: చల్మెడలోని తిరుమలనాథ స్వామి ఆలయాన్ని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామిజీకి పురోహితుడు వెంకట రామ్మోహన్ శర్మ, ఆలయ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ రమేశ్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

### రామతీర్థంలో బీరప్ప, కామరాతిల కల్యాణం

పాపన్నపేట, మే 12: మండలంలోని రామతీర్థంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప, కామరాతి దేవీల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ రామతీర్థం ప్రజలంతా సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. వారి వెంట ఏడుపాయల మాజీ చైర్మన్లు బాలాగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచులు గురుమూర్తి, బద్రి, మల్లేశం, నాయకులు బాబాగౌడ్, సాయిరెడ్డి, దుర్గయ్య, అనిల్‌రెడ్డి, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

చిన్నశంకరంపేట, మే 12: అంబాజిపేటలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి గౌడ సంఘం సభ్యులు సోమవారం అందజేశారు. ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించే కల్యాణానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికలు అందజేసి కోరారు.

# భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు



చిలిపిచెడ్: గన్నతండాలో పట్టాపాసుబుక్కులు అందజేయాలని కలెక్టర్‌ను కోరుతున్న గిరిజనులు



మెదక్‌లో అమరవీరుల స్తూపం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

చిలిపిచెడ్, మే 12: భూ సమస్యలు ఉన్న వారు భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా చిలిపిచెడ్ మండలంలోని గౌతాపూర్, సోమక్కపేట గ్రామాల్లో సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. గౌతాపూర్‌కు వచ్చిన కలెక్టర్‌కు గన్యతండాలో 204 సర్వే నెంబర్‌లో 106 మంది రైతులకు పాత పాస్‌బుక్‌లో పట్టా ఉన్నదని, కొత్త పాస్‌బుక్‌లో పట్టా నమోదు కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సదస్సులో భూ రికార్డుల్లో పేర్లు తప్పులు, భూమి విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌బుక్కు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్దేశిత గడువు లోపు పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. పైలట్ మండలంలోని గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాక, జిల్లా వ్యాప్తంగా జూన్ మొదటి వారంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. గౌతాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్లు సహదేవ్, ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్లు సింధూజ, సఫీ, ఎంపీడీవో ఆనంద్ పాల్గొన్నారు.

### అమరవీరుల స్తూపం నిర్మాణానికి స్థల పరిశీలన

మెదక్, మే 12 (నమస్తే తెలంగాణ) : అమరవీరుల స్తూపం నిర్మాణానికి జిల్లా కేంద్రంలో స్థలాన్ని పరిశీలించినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్‌లో తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్తూపం నిర్మించేందుకు టీచర్స్ కాలనీ 145 సర్వే నెంబర్, హవేళీఘనపూర్ మండలం ఔరంగాబాద్ 77 సర్వేనెంబర్ గల ప్రభుత్వ స్థలాలను హవేళీఘనపూర్ తహసీల్దార్ సింధూ రేణుక, మెదక్ డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం



చిలిపిచెడ్: శీలాంపల్లిలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి



వెల్దుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మైసయ్య

వెల్దుర్తి, మే 12: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు ఉన్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పోసుకుని రైతులు తూకం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. తూకం వేసిన ధాన్యం కూడా రైస్‌మిల్లులకు చేరడం లేదని, దీంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర: ఆర్డీవో**

చిలిపిచెడ్, మే 12: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని శీలాంపల్లిలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యంలో తాలు, మట్టి, పొలు లేకుండా కేంద్రాలకు తీసుకురావాలన్నారు. లారీల కొరత లేకుండా చూస్తున్నామన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్**

రేగోడ్, మే 12: రేగోడ్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ దత్తారెడ్డి, ఏపీఎం సంగీతతో కలిసి పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు.

**కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి**

నిజాంపేట, మే 12: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఏవో సోమలింగారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని నస్కల్, నందగోకుల్, రాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవో శ్రీలతతో కలిసి సందర్శించారు.

**కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి**

చిన్నశంకరంపేట,మే 12: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మన్నన్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని అంబాజిపేట, గవ్వలపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



చిన్నశంకరంపేటలో ఉపాధ్యాయుల సమావేశం

రామాయంపేట, మే 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలపై చొరవ చూపాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు సోమవారం నిర్వహించారు.

**ఆధునిక పద్ధతులతో విద్యాబోధన**

చిన్నశంకరంపేట, మే 12: చిన్నశంకరంపేటలో ఉపాధి పనులు చేస్తున్న చోటకు వెళ్లి బడిబాట కింద తల్లిదండ్రులకు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం దీప్లారాథోడ్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాసులు, అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ విద్య వంటి అధునాతనమైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఉపాధ్యాయులు బాలరాజు, వినయ్‌కుమార్, రతన్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

**కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్**

నిజాంపేట, మే 12: నిజాంపేటలోని ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ కొనసాగుతున్నది. కుట్లు, అల్లికలు, పేపర్ ప్లవర్లు, డ్రాయింగ్ వంటి వాటిని క్రాఫ్ట్ టీచర్ రోజా నేర్పిస్తున్నారు. సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మెదక్ స్టేడియంలో లాంగ్ టర్మ్ క్రికెట్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

## అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, మే 12: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలిపారు.

**లాంగ్ టర్మ్ క్రికెట్ కోచింగ్ సెంటర్ ప్రారంభం**

జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో లాంగ్ టర్మ్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. జాతీయ క్రీడాకారుడు కానిస్టేబుల్ సాయి ఆధ్వర్యంలో ఈ కోచింగ్ క్యాంపు నడుస్తుందని పేర్కొన్నారు.

## అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు



జేసీబీని సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నర్సాపూర్, మే 12: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం నర్సాపూర్ పరిధిలోని హన్మంతాపూర్ సర్వే నెంబర్ 134లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారనే సమాచారం మేరకు మెదక్ మైన్స్ జాయింట్ ఇన్‌స్పెక్టర్, నర్సాపూర్ రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఆత్మరక్షణ కోసం కరాటే ఉపయోగం



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

చిన్నశంకరంపేట, మే 12: ఆత్మ రక్షణకోసం కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్ తెలిపారు. సోమవారం కరాటే శిక్షణా శిబిరాన్ని సందర్శించి వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పుష్పవేణి, కోచ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట, మే 12: అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో హేమభార్గవి అన్నారు. సోమవారం శివ్వంపేటలోని అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ లబ్ధిదారుల గృహ సందర్శనతో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను వారి ఇంటి వద్దకు తీసుకెళ్లి ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

## జోరుగా ఫార్మర్ రిజిస్ట్రేషన్



రామాయంపేటలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

రామాయంపేట, మే 12: పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను జోరుగా కొనసాగిస్తున్నారు. సోమవారం కార్యాలయంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు తీసుకొచ్చి రిజేస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు ఏవో రాజ్‌నారాయణ, విస్తీర్ణ అధికారి ప్రవీణ్ తెలిపారు. ఇప్పటివరకు 650పై గానే రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం




రామాయంపేట, మే 12: డి.ధర్మారం గ్రామానికి చెందిన నింగరమైన నర్సవ్వ(55) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ నాయకుల ద్వారా అందజేశారు.

## రేపు క్రికెట్ లీగ్ మ్యాచ్‌లకు క్రీడాకారుల ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, మే 12: ఈనెల 14న మెదక్ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-25 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌ల నేపథ్యంలో రెండు జట్ల ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆసక్తి గల క్రీడాకారులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎంపికకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## ఏడుపాయల్లో పల్లకీ సేవ



పాపన్నపేట, మే 12: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు.